సాక్షి తిరుపతి

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



కపట కూటమిని కూలదోస్తాం

కపట కూటమిని కూలదోయడం ఖాయమని ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు గురుమూర్తి, అభినయ్ స్పష్టం చేశారు. - 8లో



పేదవాడి గుండె చప్పుడు జగనన్న

పేదవాడి గుండె చప్పుడు సీఎం జగనన్న అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. - 8లో



వైఎస్సార్‌సీపీలో చేరిక

వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు పెరుగుతోంది. పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు చేరుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

బంగారు తిరుచ్చిపై అలిమేలు మంగమ్మ



తిరుచ్చి వాహనంపై భక్తులను అనుగ్రహిస్తున్న శ్రీపద్మావతీ అమ్మవారు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేక సేవను నిర్వహించారు. తదుపరి శ్రీకృష్ణ ముఖ మండపంలో స్వామి, అమ్మవార్లకు పాంచరాత్ర ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా చేపట్టారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అమ్మవారికి విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవను నిర్వహించారు. అనంతరం సర్వాంగ శోభితురాలైన శ్రీవారి పట్టపురాణి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 22 వరకు గడువు

తిరుపతి అర్బన్: ఎన్నికల విధుల్లోని ఉద్యోగులతోపాటు అత్యవసర సేవలకు చెందిన వారు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి ఫారం-12ను దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 22 వరకు గడువు ఉందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఎలక్షన్ డ్యూటీ ఏ ప్రాంతంలో ఉన్నా దానితో సంబంధం లేకుండా ఓ మండలంలో వారికి ఓటు ఉందోలేదో ముందుగా తెలుసుకోవాలన్నారు. అనంతరం వారు తమ డ్యూటీ కాపీతోపాటు ఓటర్ కార్డు, ఏదైనా గుర్తింపు కార్డుల జిరాక్స్‌లను ఓటు ఉన్న మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌కు ఈ నెల 22వ తేదీలోపు అందించాలని సూచించారు. అనంతరం మే 6న ఎన్నికల విధుల్లోని ఉద్యోగులు ఫెసిలిటేషన్ డెస్క్‌లో ఓటును వినియోగించుకోవాలని సూచించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురు వారం అర్ధరాత్రి వరకు 55,537 మంది స్వామివారిని దర్శించుకోగా, 20,486 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ భక్తుల కు సకాలంలోనే దర్శనమవుతుండగా.. టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



పుంగనూరులో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ద్వారకనాథరెడ్డి

● సమరోత్సాహం

గుండెల నిండా అభిమానం.. వీధులన్నీ జనసంద్రం.. ప్రతి హృదయంలో జగన్నినాదం.. వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సమరోత్సాహం.. అందరి మదిలో గెలుపే లక్ష్యం.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. శుక్రవారం ఈ మేరకు ఆయా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా నామినేషన్లు దాఖలు చేశారు. తమను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. - సాక్షి, నెట్‌వర్క్



నగరిలో నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న మంత్రి ఆర్కే రోజా

అభ్యర్థుల హోరు.. నామినేషన్ల జోరు

ఎన్నికల సంగ్రామంలో నామినేషన్ల పర్వం అట్టహాసంగా కొనసాగుతోంది. రెండో రోజు శుక్రవారం మొత్తం 20 నామినేషన్లు దాఖలు చేశారు. కొందరు హంగు, ఆర్భాటాలకు తావులేకుండా నామినేషన్లు వేస్తున్నారు. మరికొందరు సెంటిమెంట్లతో ముందుకు సాగుతున్నారు. అధికారులు ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో అభ్యర్థులు, వారి సహచరులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.



తిరుపతి కలెక్టరేట్‌లో నామినేషన్ పత్రాలను అందిస్తున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

జిల్లాలో రెండో రోజు 20 నామినేషన్లు

- ఇందులో పార్లమెంట్‌కు 3 నామినేషన్లు
- పకడ్బందీగా ఏర్పాట్లు
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పార్లమెంట్, అసెంబ్లీకి సంబంధించి రెండో రోజు 20 నామినేషన్లు వేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగింది. నియోజకవర్గాల వారీగా రెండో రోజు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన వివరాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఆర్వో కార్యాలయాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నామినేషన్ వేయడానికి విచ్చేసిన అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.



తిరుపతి అసెంబ్లీకి ఓ సెట్ నామినేషన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి పార్లమెంట్‌కు 3 నామినేషన్లు

మద్దిల గురుమూర్తి (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ), సి.నవ్య కిరణ్ (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ), చింతా మోహన్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ) అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

గూడూరు అసెంబ్లీకి 3 నామినేషన్లు

మేరిగ మురళీధర్ (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ), గోను సంధ్యారాణి (తెలుగు దేశం పార్టీ), పాసం సునీల్‌కుమార్ (తెలుగు దేశం పార్టీ) అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు.

సూళ్లూరుపేట అసెంబ్లీకి 3 నామినేషన్లు

కిలివేటి సుభాషిణి (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ), నెలవల విజయశ్రీ (తెలుగుదేశం పార్టీ), గాడి తిలక్ బాబు (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్).

వెంకటగిరి అసెంబ్లీకి 4 నామినేషన్లు

కురుగొండ్ల లక్ష్మి సాయిప్రియ (తెలుగు దేశం పార్టీ), కురుగొండ్ల రామకృష్ణ (తెలుగు దేశం పార్టీ), వీ.ఆర్ముగం (ఇండిపెండెంట్), షేక్ షఫీ (ర్యాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేద్కరిస్ట్)

చంద్రగిరి అసెంబ్లీకి ఒక నామినేషన్

కె.శ్రీనివాసులు అలియాస్ కేపీఎస్.వాసు (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్)

తిరుపతి అసెంబ్లీకి 3 నామినేషన్లు

భూమన అభినయ్ (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ), లక్ష్మి ఎల్‌ఎస్. (సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా, కమ్యూనిస్ట్ పార్టీ), కె.కాంతా రావు (ఇండిపెండెంట్)

శ్రీకాళహస్తి అసెంబ్లీకి ఒక నామినేషన్

డా.గానుగపెంట రమేష్ (నేషనలిస్ట్ జనశక్తి పార్టీ)

సత్యవేడు అసెంబ్లీకి 2 నామినేషన్లు

కె.ఆదిమూలం (తెలుగు దేశం పార్టీ), జడ్డా రాజాశేఖర్ (ఇండిపెండెంట్)

అభివృద్ధికి అండగా నిలవండి.. సంక్షేమానికి రెండు ఓట్లు వేయండి

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి
- అట్టహాసంగా ఎంపీ మద్దిల గురుమూర్తి నామినేషన్

తిరుపతి అర్బన్: సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో సాగాలంటే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన తిరుపతిలోని తన నివాసం నుంచి నిరాడంబరంగా వెళ్లి మధ్యాహ్నం 12.28 గంటలకు తిరుపతి కలెక్టరేట్‌లో ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో ఆర్వో ప్రవీణ్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రతి ఇంటికీ మంచి చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనను దృష్టిలో ఉంచుకుని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీ పరిధిలో రూ.9,680 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రూ.28వేల కోట్లకు చెందిన పరిశ్రమలు జిల్లాకు వచ్చాయని, అందులో 43,700 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. రూ.200 కోట్లతో ఎడ్యుకేషన్ రంగాలను అభివృద్ధి చేశామన్నారు. గ్రామ స్వరాజ్యంలో భాగంగా రూ.5 వేల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేసినట్టు వివరించారు.



కుటుంబ సభ్యుల చేతుల మీదుగా నామినేషన్ పత్రాలు అందుకుంటున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

పరిమితి మించితే అనర్హత వేటే



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్: అభ్యర్థులు నిబంధనలకు మించి ఖర్చుచేస్తే అనర్హత వేటు తప్పదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు ప్రదీప్‌కుమార్, అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు వీజీ శేషాద్రి, మీనుఓలాతో కలిసి ఎన్నికల వ్యయ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 29న తుది అభ్యర్థుల జాబితా మేరకు అభ్యర్థి వ్యయాల నిర్వహణకు రిజిష్టర్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అనంతరం జిల్లా వ్యయ పరిశీలన నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఖర్చుల జాబితాను వివరించారు.

పెండింగ్ క్లెయిమ్ పూర్తిచేయండి

తిరుపతి అర్బన్: ఆర్వోలు పెండింగ్ క్లెయిమ్‌లను ఈ నెల 25వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. సెక్టోరల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాల కల్పన ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్‌పై సెక్టరల్ అధికారులు, బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలని చెప్పారు. ఎపిక్ కార్డులు రిటర్న్ వచ్చినవి బీఎల్వోల ద్వారా సంబంధిత ఓటరుకు అందేలా పక్కాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఆర్ఓ పెంచల కిషోర్ పలువురు నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి బుగ్గోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఈ నెల 20 శనివారం నుంచి 22వ తేదీ వరకు బుగ్గోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు జరుగనున్న ఈ ఉత్సవంలో రోజూ మధ్యాహ్నం 2 గంటలకు ఆలయంలోని బుగ్గ వద్దకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజ స్వామివారిని వేంచేపు చేస్తారు. మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహిస్తారు.

తిరుపతి బరిలో.. మచ్చలేని యువతరం

- తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా గురుమూర్తి నామినేషన్
- ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో భూమన అభినయ్



తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తి



తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్

తిరుపతి సిటీ: తిరుపతి ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఆ పార్టీ తరఫున ఎంపీ అభ్యర్థిగా మద్దిల గురుమూర్తి శుక్రవారం నామినేషన్ దాఖలు చేయగా, ఎమ్మెల్యే అభ్యర్థిగా భూమన అభినయ్ గురువారం నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లో స్థిర, చరాస్తులతో పాటు, విద్యార్హత వివరాలను పొందుపరిచారు. ఇందులో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులపై ఎటువంటి క్రిమినల్, సివిల్ కేసులు లేకపోవడం, ఉన్నత విద్యను అభ్యసించినట్లు అఫిడవిట్‌లో పేర్కొనడంతో నగరంలోని ప్రజలు అభినందిస్తున్నారు.

మచ్చలేని నాయకుడు మద్దిల గురుమూర్తి

తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మద్దిల గురుమూర్తి మృదు స్వభావి. ప్రతిపక్షపార్టీ నాయకులు సైతం వేలు ఎత్తి చూపని యువనేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. తనపై ఎటువంటి కేసులు లేవని ధ్రువీకరిస్తూ అఫిడవిట్‌ను సమర్పించారు. తాను బ్యాచులర్ ఆఫ్ ఫిజియోథెరఫీ (బీపీటీ) పూర్తి చేశానని తెలిపారు. తిరుపతి ఎంపీగా ప్రజలకు సేవ చేశానని పేర్కొన్నారు. సాధారణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చి బడుగుబలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా తన స్థిర, చర ఆస్తుల పూర్తి వివరాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. రాజకీయాలలో నేడు మచ్చలేని నాయకుడిగా గుర్తింపు తెచుకోవడం అంత సులువైన వ్యవహారం కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

విద్యావంతుడు.. నిస్వార్థపరుడు అభినయ్


తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న భూమన అభినయ్‌రెడ్డి గురువారం నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. తొలిసారి ఎమ్మెల్యేగా దిగుతున్న యువనేత భూమన అభినయ్ బీటెక్, జేఎన్‌టీయూలో పూర్తిచేసి, లండన్‌లో ఎమ్మెస్సీ బిజినెస్ ఇన్‌ఫర్‌మేషన్ సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ పూర్తిచేశారు. విద్యావంతుడుగా, నిస్వార్థపరుడుగా గుర్తింపు తెచ్చుకున్నారు. యువనేతపై ఇప్పటి వరకు ఎటువంటి క్రిమినల్, సివిల్ కేసులు లేవు. ఆయన తన తండ్రి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని ఆదర్శంగా ప్రజాసేవకు అంకితమయ్యారు. ఎన్నికల అఫిడవిట్‌లో తన కుటుంబ వివరాలతో పూర్తి సమాచారం సమర్పించారు.

క్లీన్‌చిట్



సూళ్లూరుపేట: సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన కిలివేటి సంజీవయ్యపై ఎలాంటి కేసులు గాని, వాయిదాలు గాని, బ్యాంక్‌ల్లో రుణాల ఎగవేతలు గాని లేవు. ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపరిచిన వివరాల మేరకు ఆయనపై చిన్న మచ్చ కూడా లేదు. ఆయన మొదటి నుంచి సౌమ్యుడు, శాంతపరుడు అన్న పేరును సార్థకం చేసుకుంటూ ఎన్నికల అఫిడవిట్‌లో కూడా చిన్న పొరపాటు లేకుండా క్లీన్‌చిట్‌గా ఉన్నారు.

నెలవల విజయశ్రీకి రూ.2 కోట్ల ఆస్తులు



సూళ్లూరుపేట టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీపైనా ఎలాంటి కేసులు లేవు. ఎన్నికల అఫిడవిట్‌లో రూ.2 కోట్లకు పైగా ఆస్తులు, వాహనాలు ఉన్నట్టు తెలిపారు. బ్యాంక్‌ల్లో సుమారు రూ.65 లక్షల మేర అప్పు ఉన్నట్టు చూపించారు. 150 గ్రాముల బంగారం, ఇద్దరి పిల్లల మీద రూ.10 లక్షల చొప్పున రెండు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి.



శ్రీరాముల వారికి పట్టాభిషేకం

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం చేశారు. ఉదయం 8 గంటలకు ఉత్సవమూర్తులను ఊంజల్ మండపానికి వేంచేపు చేశారు. నరసింహ తీర్థం నుంచి తీసుకొచ్చిన జలంతో శ్రీకోదండరామునికి అభిషేకం చేశారు. అనంతరం 9 నుంచి 11 గంటల వరకు యాగశాలలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. రాత్రి శ్రీరామ పట్టాభిషేకం శాస్త్రోక్తంగా చేపట్టారు. శ్రీరామ పట్టాభిషేకం అనంతరం శ్రీసీతారామ లక్ష్మణులను బంగారు తిరుచ్చిపై, ప్రత్యేక తిరుచ్చిపై శ్రీఆంజనేయ స్వామివారిని కొలువుదీర్చి ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఘనంగా ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగతర్న,అదనపు ఎఫ్‌ఏ అండ్ సీఏవో రవిప్రసాద్, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్ పాల్గొన్నారు.



శ్రీరాముని పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకిస్తున్న అధికారులు, భక్తులు



పట్టాభిషేక మహోత్సవం

మచ్చలేని నేత నేదురుమల్లి



సైదాపురం: వెంకటగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నేదురుమల్లి ఎలాంటి మచ్చలేకుండా క్లీన్ చిట్‌గా ఉన్నారు. నామినేషన్ సందర్భంగా ఆయన సమర్పించిన అఫిడవిట్‌లో ఎలాంటి పోలీసు కేసులు ఆయన పైన నమోదు కాకపోవడం విశేషం.

తండ్రి: నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి
తల్లి : నేదురుమల్లి రాజ్యలక్ష్మి, మాజీ మంత్రి
వ్యక్తిగత ఆస్తులు : రూ.7.08 కోట్లు
సతీమణి స్వప్నరెడ్డి ఆస్తులు: రూ.55.9 లక్షలు

నేరచరిత్రలో బొజ్జల సుధీరుడు!



రేణిగుంట: శ్రీకాళహస్తి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డిపై 15 కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు ఆయన ఎన్నికల అఫిడవిట్లో పొందుపరిచారు. అకౌంట్లో రూ.1,15,61,485 నగదు ఉంది. భార్య రిషితారెడ్డి చేతిలో రూ.10,90,597 నగదు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆయన స్వగ్రామం శ్రీకాళహస్తి మండలం, ఊరందూరులో 3.38 ఎకరాల వ్యవసాయ భూమి, ఇల్లు, గోవాలో ఒక మడ్‌హౌస్, హైదరాబాద్ బంజారాహిల్స్ ఇల్లు ఉంది. స్థిరాస్తుల మొత్తం విలువ రూ.9,46,66, 994. భార్యాభర్తలిద్దరి పేరున బ్యాంక్ రుణాల రూ.5కోట్లు ఉన్నాయి. బంగారు ఆభరణాలు 1,644 గ్రాములు, వెండి 2,520 గ్రాములు ఉన్నట్లు ధ్రువీకరించారు.

లక్ష్మీసాయిప్రియ తండ్రిపై 11 కేసులు



సైదాపురం : వెంకటగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ తండ్రి, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణపై ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 11 కేసులు ఉన్నాయి. ప్రస్తుతం ఆమె స్థిర నివాసం కూడా వెంకటగిరే అనే చిరునామా చూపారు.

బంగారు : 1100 గ్రాములు, విలువ రూ.75 లక్షలు
వెండి : 2000గ్రాములు
అభ్యర్థి భర్త శ్రీనివాసతేజ పేరు మీద ఆస్తి విలువ : రూ.3,20,14,426
కార్లు : రూ.3.2 కోట్ల విలువ చేసే ఐదు కార్లు
అభ్యర్థి పేరు మీద : రూ.9 కోట్లు
అభ్యర్థి తండ్రి కురుగొండ్ల రామకృష్ణ మీద : రూ.4కోట్ల

పాశం సునీల్‌కుమార్‌పై 14 కేసులు



గూడూరు రూరల్: గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌పై 14 కేసులు ఉన్నాయి. ఆ మేరకు ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2009 నుంచి 2023 వరకు ఆయనపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్టు చూపారు. ఇందులో గూడూరు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో 8 కేసులు, గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు, వెంకటగిరిలో ఒకటి, నెల్లూరు బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఒకటి, చిన్నబజార్ పోలీస్ స్టేషన్‌లో మరో కేసు ఉన్నట్లు పొందుపరిచారు.

క్లుప్తంగా

ఎన్నికల సామగ్రి స్వాధీనం

తడ: ఎన్నికల్లో వాడేందుకు చెన్నై నుంచి నెల్లూరు వెళుతున్న ఎన్నికల సామగ్రిని బీపీ పాళెం చెక్‌పోస్టు వద్ద అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పీ.నరశింహారావు కథనం .. జెండాలు, ప్లకార్డులు, తదితర వస్తువులతో చెన్నై నుంచి దోస్తు వాహనంలో వస్తున్న సరుకుకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో వాటిని చెక్‌పోస్టులో గురువారం రాత్రి అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు దీనిపై శుక్రవారం కేసు నమోదు చేసి రూ.2.32 లక్షల విలువైన ఎన్నికల సామగ్రితోపాటు వాహనాన్ని సీజ్ చేశారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

తిరుపతి క్రైమ్: తిరుపతి–రేణిగుంట మధ్య మార్గంలోని తిరుచానూరు రైల్వే స్టేషన్ వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే సీఐ హేమసుందర్‌రావు తెలిపిన వివరాల మేరకు.. 40 నుంచి 45 సంవత్సరాల మధ్య గల వ్యక్తి తిరుచానూరు రైల్వే స్టేషన్ వద్ద ఓ రైలు కింద పడి మృతి చెందాడు. అయితే మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వద్ద హీరో హోండా బైక్, మొబైల్ ఫోన్ లభించాయి. ఆచూకీ తెలిస్తే 94406827638లో సంప్రదించాలని సూచించారు.

నయనానందకరం.. కొట్టాయి ఉత్సవం



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో కొట్టాయి ఉత్సవం మూడో రోజు శుక్రవారం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం అలంకార మండపంలో శ్రీస్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను సుగంధ పరిమళభరిత పుష్పమాలలు, స్వర్ణాభరణాలతో అలంకరించారు. అక్కడి నుంచి ఉత్సవమూర్తులను పల్లకిపై ఊరేగింపుగా ఆలయంలోని కోట మండపం వద్ద పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చి కొలువుదీర్చారు. అలాగే ఆలయంలో శుక్రవారోత్సవం సందర్భంగా పంచహారతులు సమర్పించారు.

కపట కూటమిని కూలదోయడం ఖాయం

- వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు
- జగనన్న సంక్షేమం, అభివృద్ధికి ఆకర్షితులవుతున్న ప్రతిపక్ష పార్టీ నేతలు

తిరుపతి మంగళం: ఈ ఎన్నికల్లో కపట కూటమిని కూలదోయడం ఖాయంగా కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా పలువురు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరడంతో కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపుతోంది. తిరుపతి పద్మావతీపురంలోని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నివాసంలో శుక్రవారం కార్పొరేటర్ కోటూరు ఆంజినేయులు, అధ్యక్షులు రాపూరి ప్రసాద్, కోటూరు శశి ఆధ్వర్యంలో 13వ డివిజన్‌కు చెందిన నల్లాని సరోజమ్మ, నడిపమ్మ, లక్ష్మమ్మ, తిరుమల, నీమ్మ, శాంతమ్మ, అరుణమ్మ, పవన్‌కుమార్‌తో పాటు మరో 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తిరుపతి అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న భూమన అభినయ్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని వారు ప్రతినారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ మట్లాడుతూ చంద్రబాబు మోసాలు, పవన్‌కళ్యాణ్ ప్యాకేజీలను పసిగట్టిన టీడీపీ, జనసేన శ్రేణులు ఆ పార్టీలు వీడుతున్నారని తెలిపారు.



పార్టీలో చేరిన వారితో తిరుపతి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మద్దిల గురుమూర్తి, భూమన అభినయ్‌రెడ్డి



గూడూరు : టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నేతలతో మేరిగ మురళీధర్

200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని మేజర్ పంచాయతీ చెన్నూరులో టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు కల్లూరు రవి, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చేవూరు విజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో 200 కుటుంబాలు గూడూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి మేరిగ మురళీధర్ వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా మేరిగ మాట్లాడుతూ చెన్నూరులోని 1 ,2 హరిజవాడలు, రామలింగయ్య కాలనీ, బీసీ కాలనీల్లో మంచి పట్టున్న నాయకుడు కల్లూరు రవి వైఎస్సార్‌సీపీలో చేరడం, ఆయనతోపాటు 200 కుటుంబాలు, ఆటో యూనియన్ వారు కూడా రావడం చెన్నూరులో పార్టీకి అదనపు బలం చేకూరినట్టయ్యిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పాళ్ల చంద్రమోహన్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కొట్టు గోవర్దన్, కటికాల శేషగిరి, రాజేష్ యాదవ్, జేసీఎస్ తిరుపతి జిల్లా కన్వీనర్ సనత్‌కుమార్, ఆటో యూనియన్ నాయకులు దారా రమేష్, బాబు, గిరి పాల్గొన్నారు.

150 టీడీపీ కుటుంబాలు చేరిక

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు వెల్లువెత్తాయి. తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో భాకరాపేట గ్రామ పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. భాకరాపేట గ్రామ పంచాయతీలో ఏకంగా 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడంతో మరింత బలం చేకూరింది. వీరందరికీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందజేసిన పార్టీని ఆదరిస్తారనేందుకు ప్రతిపక్ష పార్టీ నేతలు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్న పరిమాణాలే నిదర్శనమని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో జయపాల్, నరేంద్ర, రఘు, గురు, తూకేష్, లక్ష్మీదేవి, నంద, గణేష్, శివ, వినోద్, రాకి, దిల్, క్రిష్ణ, సుబ్రమణ్యం, రవి, దినకర్, సిసింద్రీ, అబ్బయ్య, రాము, నరేంద్ర, పవన్, వేణు, బాలాజీ, మణి, మస్తాన్, ఉపేంద్ర, మహేష్ తదితరులు ఉన్నారు. భాకరాపేట గ్రామ సర్పంచ్ సాకిరి భూపాల్, డివిజన్ అధ్యక్షులు గురుశంకర, పంచాయతీ అధక్షులు తైదుల రమణ, షాబాద్‌అలీఖాన్, రాజశేఖర్, ఉమా, మణి, నాగప్ప, హరినాథ్, పురుషోత్తం, అర్జున్ రెడ్డి, రామయ్య పాల్గొన్నారు.



భాకరాపేట : టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీలోకి వలసలు

వెంకటగిరి రూరల్ : నేదురుమల్లి నివాసంలో నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో వెంకటగిరి రూరల్ మండలంలోని పారవోలు, బాలసముద్రం, పాలెంకోట గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కాల్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ నేత సదారెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

50 కుటుంబాలు చేరిక

సైదాపురం: వైఎస్సార్‌సీపీ బీసీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్‌యాదవ్, నియోజకవర్గ పరిశీలకులు కొడవలూరు ధనంజయ్యరెడ్డి సమక్షంలో సుమారు 50 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి.



వెంకటగిరి: నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రూరల్ టీడీపీ నేతలు

సంక్షేమానికి జై



గూడూరు రూరల్: కాండ్రలో జగనన్న సేవా సమితి అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి

గూడూరు రూరల్: గూడూరు మండంలోని కాండ్ర గ్రామంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. జగనన్న సేవా సమితి అధ్యక్షుడు ఊటుకూరు మహేంద్రరెడ్డి సమక్షంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పాళ్ల పెంచలరాజు, నన్నూరు రాజశేఖర్ ఆధ్వర్యంలో 40 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. విందూరు ఎంపీటీసీ సభ్యుడు వెంకటరెడ్డి, చరణ్ పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీకోదండ రాముని తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి తెప్పోత్సవాలు ఈ నెల 21 ఆదివారం నుంచి 23వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ప్రతి రోజు రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు శ్రీరామచంద్ర పుష్కరిణిలో ఈ ఉత్సవాలు అత్యంత వేడుకగా సాగుతాయి. ఈ సందర్భంగా ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు శాస్త్రోక్తంగా శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామ స్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. తెప్పోత్సవాల్లో భాగంగా మొదటి రోజు తెప్పలను అధిరోహించి స్వామి, అమ్మవారు శ్రీరామచంద్ర పుష్కరిణిలో ఐదు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిస్తారు. రెండో రోజు ఏడు చుట్లు, చివరి రోజు తొమ్మిది చుట్లు స్వామివారు తెప్పలపై విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పేదవాడి గుండె చప్పుడు జగనన్న

- ప్రజాసంక్షేమం, అభివృద్ధే జగనన్న అజెండా
- టీడీపీ, జనసేన కూటమికి ఓటమి తప్పదు
- తిరుపతిలో అభినయ్ గెలుపును జగనన్నకు కానుకగా ఇద్దాం
- 46వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన

తిరుపతి మంగళం: ప్రపంచ దేశాలే మెచ్చేలా, ఆచరించేలా పేదలకు అందించిన సంక్షేమ పథకాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రతి పేదవాడి గుండె చప్పుడయ్యారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే అజెండాగా జగనన్న పరిపాలన సాగించారని, జగనన్న సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడి జీవితంలో వెలుగులు నింపాయన్నారు. తిరుపతి 46వ డివిజన్ జీవకోనలో పార్టీ సీనియర్ నాయకులు పందలూరు పెంచలయ్య, పందలూరు ప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే అజెండాగా భావించి ప్రతిపేదవాడికి మరింతగా సంక్షేమం ఎలా అందించాలన్న తపన జగనన్నదైతే, జగనన్నను తిట్టడమే ఎజెండాగా ప్రతిపక్షాలు పెట్టుకున్నాయని మండిపడ్డారు. గత 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో ప్రజలకు ఏ చిన్నపాటి మేలు చేయలేదు కాబట్టే ఈ ఎన్నికల్లో ఒక్కడిగా వచ్చి పోటీచేసే దమ్ములేక జనసేన, బీజేపీలతో పొత్తులు పెట్టుకున్న ప్రజాద్రోహి చంద్రబాబు అన్నారు. చంద్రబాబు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా టీడీపీ, జనసేన కూటమికి ఓటమి తప్పదని హెచ్చరించారు. తిరుపతిలో అభినయ్‌ని భారీ మెజారిటీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దేవదానం, వెంకటరెడ్డి, కొండ మునిరెడ్డి, కంకనాల రమేష్, కార్పొరేటర్లు కోటేశ్వరమ్మ, ఆరణి సంధ్య, పార్టీ నాయకులు పుష్పాచౌదరి, బాలకృష్ణ, మురళి, విడగొట్టి రమణ, పెరుగు బాబూయాదవ్, మాధవనాయుడు, కిరణ్‌రాయల్, శారద, భాగ్యమ్మ, కవితమ్మ పాల్గొన్నారు.



భారీ జనసందోహం నడుమ భూమన ఎన్నికల ప్రచారం



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష

పురిటిబిడ్డకు అరుదైన శస్త్రచికిత్స

తిరుపతి తుడా: తిరుపతి రుయా చిన్నపిల్లల ఆస్పత్రిలో పురిటి బిడ్డకు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు. మలద్వారం లేకుండా జన్మించిన ఓ శిశువుకు అరుదైన శస్త్ర చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొచ్చారు. శుక్రవారం రుయా చిన్న పిల్లల ఆస్పత్రి విభాగాధిపతి డాక్టర్ మనోహర్ నేతృత్వంలోని వైద్య బృందం చికిత్సను చేపట్టింది. నెల్లూరు జిల్లా, గల్లిపాలెం గ్రామానికి చెందిన ఓ గర్భిణి మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే ఆ శిశువుకు మలద్వారం లేకపోవడాన్ని గుర్తించిన తల్లిదండ్రులు నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. శస్త్ర చికిత్స చేసి మలద్వారాన్ని సృష్టించాలని వైద్యులు చెప్పారు. దీంతో ఆ శిశువును తిరుపతి రుయా చిన్నపిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. వివిధ పరీక్షలు, స్కానింగ్ అనంతరం బిడ్డకు మలద్వారాన్ని సృష్టించాలని వైద్యులు నిర్ణయించారు. ఆమెకు డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సుధాకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజ్కిరణ్, డాక్టర్ జగదీష్‌తో కూడిన వైద్యుల బృందం పురిటి బిడ్డకు మలద్వారాన్ని ఏర్పాటు చేసి సాధారణ స్థితికి తీసుకొచ్చారు.

ప్రాణం పోసిన ఆరోగ్యశ్రీ

అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను రుయా వైద్యులు విజయవంతంగా చేపట్టి పురిటి బిడ్డకు పునర్జన్మను ప్రసాదించారు. లక్షలతో కూడుకున్న ఈ వైద్యాన్ని ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా బిడ్డ తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.



పురిటి బిడ్డ

ఆల్‌ది బెస్ట్ బ్రదర్

తిరుపతి అర్బన్: 'ఆల్‌ది బెస్ట్ బ్రదర్' అంటూ వైఎస్సార్‌సీపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తిని, స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి ఆత్మీయ ఆలింగనం చేసుకోవడంతో కార్యకర్తలు సంబరాల్లో మునిగితేలారు. శుక్రవారం తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నివాసం వద్ద పలువురు టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో భూమన అభినయ్‌తోపాటు ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఎంపీకి భూమన అభినయ్ ఆల్‌దిబెస్ట్ తెలిపారు.



ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఆత్మీయ ఆలింగనం

చెక్‌బౌన్స్ అప్పీల్ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: చెక్‌బౌన్స్ అప్పీలు కేసులో తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రానికి చెందిన ఎం.జనార్దన్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ శుక్రవారం తీర్పు చెప్పినట్లు ఫిర్యాది తరపున్యాయవాది చక్రవర్తి తెలిపారు. తిరుపతి రూరల్ వేమూరుకి చెందిన టి.రమేష్ వద్ద జనార్దన్ 2014 ఏప్రిల్ 2వ తేదీ రూ.10 లక్షలు అప్పుగా తీసుకొని ప్రో నోటు రాసి ఇచ్చాడు. ఆ సొమ్ము చెల్లించే క్రమంలో 2015 ఏప్రిల్ 30వ తేదీ రూ.7 లక్షలు విలువ చేసే చెక్కును అతను రమేష్‌కు ఇచ్చాడు. అతను ఆ చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ అయింది. దీంతో జనార్దన్‌పై రమేష్ స్థానిక రెండో అదనపు జూనియర్ జడ్జి కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశాడు. నేరం జనార్దన్‌పై రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై అతను స్థానిక మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టులో అప్పీలు దాఖలు చేశాడు.